క్లుప్తంగా

నేడు సొసైటీ మహాజన సభ

అంబాజీపేట: అంబాజీపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మహాజన సభ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్ ఆధ్యక్షతన నిర్వహించనున్నట్టు సీఈఓ కుంపట్ల అయ్యప్పనాయుడు తెలిపారు. ఈ సమావేశానికి సొసైటీ పరిధిలోని రైతులంతా హాజరుకావాలని కోరారు. ఈ సభలో సభ్యుల చేర్పులు, మార్పులు, జమాఖర్చులు తదితర అంశాలపై చర్చిస్తారన్నారు.

యూనిఫాం పంపిణీ



పెదపళ్లలో ఆశా కార్యకర్తలకు యూనిఫాంను అందజేస్తున్న వైద్యారోగ్య శాఖ అధికారులు

ఆలమూరు: పెదపళ్ల, చొప్పెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఆశా కార్యకర్తలకు శుక్రవారం యూనిఫాం పంపిణీ చేశారు. ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, ఆర్.మల్లికార్జున్, డి.సాయికిషోర్ ఆధ్వర్యంలో వైద్యారోగ్య శాఖ 67 మందికి రెండు జతల వంతున యూనిఫాం అందజేసింది. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్ఈలు ఏవీవీ రాజా అక్కుల, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఉచితంగా కంటి పరీక్షలు



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ వీరాంజనేయులు

మామిడికుదురు: రాజమహేంద్రవరం ఓఎన్జీసీ ఆధ్వర్యంలో శుక్రవారం పాశర్లపూడి శ్రీసత్రంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 300 మందికి ఉచితంగా నేత్ర పరీక్షలు చేశారు. 35 మంది కంటి శుక్లాల సమస్యతో బాధపడుతున్నట్టు గుర్తించారు. వారికి ఉచితంగా ఆపరేషన్లు చేసేందుకు వేమగిరికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లాడి వీరాంజనేయులు, శ్రీసత్రం చైర్మన్ వాసంశెట్టి రామకృష్ణ, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు, రహదారుల నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని సర్పంచ్ తరపట్ల మోహన్ సింగ్ బాబురావు అన్నారు. ఇసుకపూడి శివారు కాకరవారిపేటలో సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.10 లక్షలతో ఈ రోడ్డును నిర్మిస్తున్నామని చెప్పారు.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ చిత్రాన్ని ముద్రించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మురళి

మామిడికుదురు: భారత ఆర్థిక వ్యవస్థతో పాటు, రిజర్వు బ్యాంకు వ్యవస్థకు సృష్టికర్త అయిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రాన్ని కరెన్సీ నోట్లపై ముద్రించాలని బ్యాంక్ ఆఫ్ ఇండియా జాతీయ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ఎంప్లాయిస్ సంఘ సెక్రటరీ జనరల్ తోకల మురళి డిమాండ్ చేశారు. మామిడికుదురులో భూపతి వెంకటపతి స్వగృహం వద్ద జరిగిన దళిత సంఘాల నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ చిత్రం ముద్రించాలన్న డిమాండ్‌తో పోరాటం చేపట్టామన్నారు. పోరాటాల ద్వారానే ఏదైనా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఉద్యమాలకు పుట్టినిల్లు అయిన కోనసీమ నుంచే ఈ ఉద్యమానికి కూడా శ్రీకారం చుట్టామన్నారు. భారత రాజ్యాంగాన్ని మారుస్తామంటూ ప్రకటించిన బీజేపీని ఓడించడమే లక్ష్యంగా.. రాజ్యాంగాన్ని కాపాడండి, బీజేపీని ఓడించండి అనే నినాదంతో ఈ ఎన్నికల్లో ప్రచారం చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో దళిత సంఘాల నేతలు నీతిపూడి చంద్రరావు, నల్లి శ్రీనివాస్, బొంతు మణిరాజు, నెల్లి దుర్గాప్రసాద్, నూటికుర్తి సత్యనారాయణ, పాలమూరి విక్రమ్, కలిగితి పళ్లంరాజు, గోగి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పుంత రోడ్డు పనులకు శ్రీకారం

ఆలమూరు: సంధిపూడిలో రూ.4 లక్షల వ్యయంతో నిర్మించనున్న పుంత రోడ్డు పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆదేశాల మేరకు మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు తోరాటి లక్ష్మణరావు కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ పనులు ప్రారంభించారు. స్థానిక పెద్ద కాలువ వంతెన నుంచి వెదురుమూడి వెళ్లే దారిలో సుమారు 600 మీటర్ల మేర గ్రావెల్ రోడ్డు నిర్మించనున్నట్టు ఎంపీడీఓ ఏ.మేరీరోజ్ తెలిపారు. ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న ఈ పుంత రోడ్డు నిర్మిస్తుండడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధిని ఓర్వలేకే పచ్చనేతల విమర్శలు



ఆత్రేయపురంలో గడప గడపకూ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



వానపల్లిలో సత్యకుమారి తదితరులకు పార్టీ కండువాలు వేస్తున్న జగ్గిరెడ్డి

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- ఆత్రేయపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం

ఆత్రేయపురం: అర్హులందరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించడాన్ని పచ్చనేతలు చూసి ఓర్వలేకపోతున్నారని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఆత్రేయపురం గ్రామంలో మాజీ ఏఎంసీ చైర్మన్‌ముదునూరి రామరాజు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ చిలువూరి రామకృష్ణంరాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముదునూరి కృష్ణంరాజు, వాడపల్లి దేవస్థానం డైరెక్టర్ రొట్టే దావీద్, ఎంపీటీసీ సరేళ్ల ధనలక్ష్మితో పాటు, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు పలు సమస్యలను ఆయనకు ఏకరువు పెట్టారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆయన సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మహిళలు ఆయనకు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ప్రజల బాగోగులు గాలికి వదిలి, కాగితాల్లో అంకెల గారడీ చేసే ప్రభుత్వం తమది కాదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, కొల్లి శ్యామ్‌సన్, పాలా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో టీడీపీ నేతల చేరిక

కొత్తపేట: వానపల్లి పంచాయతీ పరిధిలో వివిధ ప్రాంతాలకు చెందిన టీడీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఆ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్ సీపీలోకి చేరారు. వానపల్లి పంచాయతీ ఒకటో వార్డు సభ్యురాలు తాడాల సత్యకుమారి, ఆమె భర్త వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు టీడీపీ నాయకులు ఆ పార్టీ విధానాలను వ్యతిరేకించి, వైఎస్సార్ సీపీ విధానాలకు, ముఖ్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలుకు ఆకర్షితులై చేరుతున్నట్టు ప్రకటించారు. గురువారం రాత్రి వీరు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరగా, ఆయన పార్టీ కండువాలు వేసి వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఒగ్గు సత్యనారాయణ, మద్దింశెట్టి శ్రీనివాసరావు, తాడాల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

రజక సంఘం ఆధ్వర్యంలో..

వానపల్లి రజక సంఘం ఆధ్వర్యంలో పలువురు సంఘ సభ్యులు టీడీపీకి రాజీనామా చేసి, వైఎస్సార్ సీపీలో చేరారు. సభ్యులు కొత్తపల్లి నరసింహమూర్తి, కొత్తపల్లి శివ, కొత్తపల్లి సత్యనారాయణ, కొత్తపల్లి పుష్పవతి, సాయిదేవి సహా 15 మంది పార్టీలో చేరగా, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

నిత్యం అభివృద్ధి పనులు

రావులపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కొత్తపేట నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి పథంలో నడిపామని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శుక్రవారం రావులపాలెంలో రూ.22 లక్షలతో నిర్మించనున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి అంటే ఇది అని చేసి చూపించామని, నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా అనేక రోడ్లు నిర్మించి ప్రజల మన్ననలు పొందామని పేర్కొన్నారు.

రొయ్యల మేత వ్యాన్ బోల్తా



మొసలపల్లి వద్ద బోల్తా కొట్టిన వ్యాన్

అంబాజీపేట: ముక్కామల–అమలాపురం బైపాస్ రోడ్డులో రొయ్యల మేతతో వెళుతున్న వ్యాన్ శుక్రవారం ఉదయం అదుపుతప్పి పక్కనున్న పంట బోదెలో బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొవ్వూరు నుంచి అమలాపురం వైపు రొయ్యల మేతతో వెళుతున్న వ్యాన్.. మొసలపల్లి సమీపంలో అదుపుతప్పి బోల్తా కొట్టింది. వ్యాన్‌లో ఉన్న డ్రైవర్‌తో పాటు, మరొకరు సురక్షితంగా బయటపడ్డారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో ఎవరికీ ఎటువంటి అపాయం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

అవినీతి నిరూపిస్తే తప్పుకుంటా..

- కొత్తపేట టీడీపీ ఇన్‌చార్జి బండారు పెద్ద దొంగ
- ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆగ్రహం

ఆత్రేయపురం: జనసేన, టీడీపీ ఉమ్మడి సభలో సీఎం జగన్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తే, ప్రజలేమీ నమ్మే స్థితిలో లేరని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆత్రేయపురం గ్రామంలో విలేకర్లతో మాట్లాడారు. కొత్తపేట నియోజకవర్గంలో తాము ఎలాంటి అవినీతికి పాల్పడలేదని చెప్పారు. ఎవరి వద్దనైనా రూపాయి తీసుకున్నానని నిరూపిస్తే, పోటీ నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. కొత్తపేట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు సత్యానందరావు, ఆయన తమ్ముడు బండారు శ్రీనివాస్ కలిసి ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అవాస్తవాలను చెప్పుకొచ్చారని విమర్శించారు. 2009లో టీడీపీ అధికారంలో ఉండగా, బండారు సత్యానందరావు తనపై 9 కేసులు నమోదు చేశారన్నారు. 2019 తర్వాత ఒక కేసు కూడా తాను బండారుపై పెట్టలేదన్నారు. సబ్‌స్టేషన్‌లో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల వద్ద బండారు డబ్బు గుంజింది నిజం కాదా అని ప్రశ్నించారు. బంగారమ్మ ట్రస్టు పేరిట నిధులు మింగారని ఆరోపించారు. ఓ పెద్దాయన తమ భూములన్నీ పేద పిల్లల చదువు కోసం ధారాదత్తం చేస్తే, నేరుగా తమ కోడలు పేరుతో నిధులు మళ్లించుకుని కాజేసిన దొంగలు మీరు కాదా అంటూ నిలదీశారు. టీటీడీ కల్యాణ మండపం ప్రారంభోత్సవ శిలాఫలకంలో వేసిన జంపా వీరభద్రం ట్రస్టు అసలు లేదని చెప్పారు. కొత్తపేట సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో కోరం జయరాజు పేరున ఆ ట్రస్టు ఉందన్న ఆధారాలు తెలుస్తాయన్నారు. ఇలా అబద్ధాలు చెబుతూ, తప్పుడు పనులు చేసే వారంతా.. తమను అవినీతిపరులు అనటం ఎంతవరకు సమంజసమని జగ్గిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్రమశిక్షణతో మెలగాలి

ఆలమూరు: క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీనునాయక్ అన్నారు. ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్‌లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. విద్యా కమిటీ చైర్మన్ గంటా శ్రీనివాసు అధ్యక్షత వహించారు. ఎస్సై శ్రీనునాయక్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. వాహనాలపై తిరుగుతూ, బాలికలపై ర్యాగింగ్‌కు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓటేయండి

రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కోరారు. పడమటిపాలెం గ్రామంలో సుమారు రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు–నేడుతో పాఠశాలలు అభివృద్ధి చెందాయని, రైతు భరోసాతో వ్యవసాయ రంగానికి ఊపిరి లభించిందని, ఇవన్నీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమయ్యాయని వివరించారు. ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యావాణి, సర్పంచ్ ఆకుల నాగలక్ష్మి, ఎంపీటీసీ దొండపాటి సుజాత, అడబాల సుధాకర్ పాల్గొన్నారు.

గడప గడపకూ.. నిధులతో గ్రామాభివృద్ధి

రాజోలు: గ్రామీణ ప్రాంతాల్లో గడప గడపకూ నిధులతో అభివృద్ధి జరుగుతోందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం బి.సావరం, పాలగుమ్మి, చెన్నడం గ్రామాల్లో ఈ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. బి.సావరం గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ఇళ్లపట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి, సమస్యలను గుర్తించామన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని విజయపథంలో నడపాలని కోరారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, సర్పంచ్‌లు అప్పారి లక్ష్మి, కడియం రమాదేవి, బడుగు శ్రీనివాసరావు, ఎంపీటీసీలు బత్తుల హేమ, బయ్యా సునీత, బి.సావరం సొసైటీ చైర్మన్ కంచి వెంకటరమణ, పార్టీ నాయకులు కుంపట్ల చిన్నారి, కడియం పూర్ణచంద్రరావు, బత్తుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



చెన్నడంలో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు



అంతర్వేది శివాలయంలో పునర్నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రాపాక

ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

సఖినేటిపల్లి: అంతర్వేదిలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు భూమిపూజ చేశారు. ఈ పనులకు సీజీఎఫ్ గ్రాంట్ రూ.1.25 కోట్లు మంజూరైనట్టు అంతర్వేది దేవస్థానం ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు. అంతర్వేది దేవస్థానం స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి, శివాలయం అర్చకులు తొలుత ఎమ్మెల్యేతో పూజా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్‌లు కొండా జాన్ బాబు, ఒడుగు శ్రీను, నాయకులు పిప్పరరాజు, ఏసుబాబు, వేణు ప్రసాద్, అశోక్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమ పథకాల అమలు

వైఎస్సార్ సీపీ రాజోలు కో–ఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వస్తేనే ప్రజా సంక్షేమ పథకాలు అమలవుతాయని, ప్రతిపక్షాలు వస్తే వాటిని రద్దు చేస్తాయని వైఎస్సార్ సీపీ రాజోలు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. గూడపల్లిలో సర్పంచ్ సుందర తాతాజీ, మాజీ ఎంపీటీసీ దూది సాయిబాబు, గుబ్బలపాలెం సర్పంచ్ చెల్లుబోయిన శేషావేణి, మలికిపురంలో గెద్దం తులసీ భాస్కరరావు తదితరులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయితేనే బాగుంటుందని, దుష్ట చంద్రబాబు అండ్ కోను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సీఎం అంటే జగన్‌లా ఉండాలని దేశమంతా కోడై కూస్తుందన్నారు. అభివృద్ధిలో ఆంధ్ర ప్రదేశ్‌ను దేశానికే రోల్ మోడల్‌గా నిలిపిన జగన్ పేదల మనిషని అన్నారు. ఆయన వెంట నాయకులు సరెళ్ల విజయ ప్రసాద్, కొల్లాబత్తుల కుమార్, మంగెన సింహాద్రి, తాడి సహదేవ్ తదతరులున్నారు.

గీతాంజలి దోషులను శిక్షించాలి

టీడీపీ, జనసేన సోషల్ మీడియా వేధింపులకు బలైన గీతాంజలి ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని గొల్లపల్లి సూర్యారావు డిమాండ్ చేశారు. గీతాంజలి మృతికి సంతాపసూచకంగా మలికిపురంలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. నాయకులు నల్లి డేవిడ్, బండారు కాశి, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.



గూడపల్లిలో పార్టీ నాయకులతో భేటీ అయిన గొల్లపల్లి సూర్యారావు

కేడర్‌ను, ప్రముఖులను కలిసిన గొల్లపల్లి

సఖినేటిపల్లి: వైఎస్సార్ సీపీ అసెంబ్లీ కో–ఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో పార్టీ కేడర్‌ను, ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిశారు. కేశవదాసుపాలెంలో వై.సంజయ్‌గాంధీ, వై.చిట్టిబాబు, వై.సింహాచలం, కొల్లాబత్తుల సోమరాజు, చిట్టిబాబు, జయబాబు, చొప్పల మత్తయ్యకుమార్, శృంగవరప్పాడులో ఏఏఎం చైర్మన్ ఇంజేటి శామ్యూల్‌రాజు, మాజీ వైస్ ఎంపీపీ గెద్దం తులసీ భాస్కరరావు, యెనుముల ఆనంద్‌కుమార్, రాపాక వెంకట్, సఖినేటిపల్లి లంకలో వాడపల్లి రాజబాబు, చల్లా నాగరాజు, బసవా సూరిబాబు, నడింపల్లి వెంకట సుబ్బరాజును కలిశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ సరెళ్ల విజయ్‌ప్రసాద్ ఉన్నారు.



తాటిపాకలో గొల్లపల్లిని కలిసిన క్రిస్టియన్, మైనార్టీ నాయకులు

మైనార్టీల అభ్యున్నతికి ప్రాధాన్యం

రాజోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మైనార్టీల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యమిచ్చిందని గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, రాజోలు నియోజకవర్గానికి చెందిన క్రిస్టియన్, మైనార్టీ నాయకులు తాటిపాకలో గొల్లపల్లిని మర్యాదపూర్వకంగా కలిశారు. మైనార్టీ సెల్ అధ్యక్షుడు కనపాల బాబురావు మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేస్తుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపిస్తామన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభం

ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: మండల కేంద్రమైన ఆత్రేయపురంలో శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి తొమ్మిదో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్మాణ దాత పాతపాటి రమణ రాజు, రాజ్యలక్ష్మి దంపతుల చేతులమీదుగా ఉత్సవాలు మొదలయ్యాయి. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి హాజరయ్యారు. ఉదయం స్వామివారికి పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండకు చెందిన ఖండవల్లి సూర్యనారాయణాచార్యులు, ఎస్.సూర్య పురుషోత్తమ సాయి పర్యవేక్షణలో వేద పండితుల బృందం వైఖానస అగమ శాస్త్రం ప్రకారం బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభించారు. స్వామివారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. ఉదయం సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్షాదారణ, అకల్మష హోమం, సాయంత్రం పుట్టమన్ను తెచ్చి, అగ్ని మథనం, అగ్ని ప్రతిష్ఠాపన, వాస్తుపూజ, వాస్తు హోమం నిర్వహించారు. స్వామి వారిని శేషవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ నిర్మాణ దాత పాతపాటి వెంకట సత్యనారాయణరాజు (రమణరాజు) ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకులు గోరింట వినయ్ కుమార్ వర్మ, పాకలపాటి వెంకట సత్యనారాయణరాజు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

స్వామివారి ఆశీస్సులుంటాయి

కోట్లాది రూపాయల వ్యయంతో ఆలయాన్ని నిర్మించి, క్రమంతప్పకుండా వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న పాతపాటి కుటుంబానికి స్వామివారి ఆశీస్సులెప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అన్నారు. ఆయన స్వామివారిని దర్శించుకుని, ఆలయ చైర్మన్ పాతపాటి వెంకట సత్యనారాయణరాజు (రమణరాజు), సోదరులు పాతపాటి నాగరాజు, పాతపాటి రామాంజనేయరాజు కుటుంబ సభ్యులను అభినందించారు. తొలుత ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి పాతపాటి సోదరులు, మాజీ ఏఎంసీ చైర్మన్ ముదునూరి రామరాజు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ చిలువూరి రామకృష్ణంరాజు తదితరులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేద పండితులు.. ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని ఆశీర్వదించి, శాలువాతో సన్మానించారు. ఆలయ నిర్మాణం వల్ల ఈ ప్రాంతానికి మరింత శోభ చేకూరిందని జగ్గిరెడ్డి చెప్పారు. ఈ ప్రాంతాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి తన వంతు సహకరిస్తానని తెలిపారు.



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తదితరులు

యజ్ఞయాగాలతో మానవాళికి మేలు

అంబాజీపేట: యజ్ఞ యాగాల వల్ల సకల మానవాళికి మేలు జరుగుతుందని తిరుపతికి చెందిన వేంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ వేదిక్ డీన్ దువ్వూరి ఫణి యజ్ఞేశ్వరయాజులు, రాజమహేంద్రవరంలోని దత్తాత్రేయ గురుకుల పాఠశాల వ్యవస్థాపకుడు గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనాపాఠి, ప్రముఖ వేద పండితుడు ఆకెళ్ల సూర్యనారాయణ అవధాని (మేఘనాథ్) అన్నారు. ఐదు రోజులుగా పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరంలో నిర్వహించిన అగ్నిష్టోమ యాగం శుక్రవారం నాటి క్రతువుతో సమాప్తమైంది. యాగ విశిష్టతపై వారు మాట్లాడుతూ నేటి కాలంలో ఈ యాగం చేయడం ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్నదన్నారు. సుబ్రహ్మణ్యుని ద్వారా ఇంద్రాది దేవతలను ఆహ్వానించి, హవిస్సును సమర్పించారన్నారు. ఈ యాగాన్ని వేద ప్రామాణికంగా నిర్వహించామని, దీనివల్ల మానవాళికి మంచి ఫలితాలు అందుతాయన్నారు. యాగకర్త యజమానులైన ఆకెళ్ల వ్యాఘ్రేశ్వర వెంకట రామసూర్య సుబ్రహ్మణ్య నరసింహ హవిర్యాజిశర్మ, సీతానాగ మహాలక్ష్మి దంపతులు ఇకపై సోమయాజిశర్మ, సోమపీథి సీతా నాగమహాలక్ష్మిగా పిలవబడతారని పేర్కొన్నారు. యాగ నిర్వహణలో ఆఖరి రోజున మహారాత్రం, మార్జనం, సవనీయయాగం, ప్రాతస్సవనం, స్తుత శస్త్రాలు, మాధ్యందిన, తృతీయ సవనాలు, యజ్ఞపాయస మహా ప్రసాదం, ఉదయనీయా మిక్షలు, వైష్ణవి పూర్ణాహుతి, మహదాశీర్వచనం నిర్వహించారు. సుమారు 25 వేల మందికి భారీ అన్నప్రసాద వితరణను కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



బాలుర హైస్కూల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ

కొత్తపేట: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఎంఈఓ హరిప్రసాద్, ఎంఈఓ–2 కె.లీలావతితో కలిసి స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్ సెంటర్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో వివిధ అంశాలపై సమీక్షించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 940 మంది రెగ్యులర్, 111 మంది ప్రైవేట్ మొత్తం 1,051 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. మండలంలో 5 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 18న ఉదయం 9.30కు పరీక్ష ప్రారంభమవుతుందని, 8.45కే పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలని సూచించారు.


విద్యార్థులకు కిట్ల పంపిణీ

పి.గన్నవరం: విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా, ప్రణాళికాబద్ధంగా చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సీఐ ప్రశాంతకుమార్ అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 184 మంది టెన్త్ విద్యార్థులకు సహృదయ ఫౌండేషన్ ఫౌండర్ పైడి రాజేష్ ఆధ్వర్యంలో ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు పంపిణీ చేశారు.

తాగు నీటి కోసం ఆందోళన

పి.గన్నవరం: తమ గ్రామానికి పైపులైన్లు ఏర్పాటు చేసి, తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ తాటికాయలవారిపాలేనికి చెందిన మహిళలు శుక్రవారం ఆర్బీ రోడ్డుపై ధర్నా చేశారు. ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించినా, పైపులైన్లు వేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. విషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పద్మనాభం, జేఈ కల్యాణ చక్రవర్తి మహిళలతో మాట్లాడారు. త్వరలో పైపులైన్లు నిర్మించి, తాగునీరు సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసరావు




రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ వి.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన విజయవాడ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ అధ్యాపకుడిగా పనిచేసి, పదోన్నతిపై రావులపాలెం వచ్చారు. ఇక్కడి ప్రిన్సిపాల్ చప్పిడి కృష్ణ పదోన్నతిపై విజయవాడ కమిషనరేట్‌కు వెళ్లారు.

వైఎస్సార్ సీపీ విజయానికి సైనికుల్లా పనిచేయండి

పార్టీ పి.గన్నవరం ఇన్‌చార్జి విప్పర్తి

పి.గన్నవరం: వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని పి.గన్నవరం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. నరేంద్రపురంలో సొసైటీ చైర్మన్ మెల్లం మహలక్ష్మీ ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజా సంక్షేమ పాలన అందించారని వివరించారు. జగన్ పాలనలో చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించి, వారి మద్దతు కోరాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అద్దగళ్ల వెంకట సాయిరామ్, రాయుడు చిన్న, జల్లి పండు, నేలపూడి సత్యనారాయణ, గుత్తుల సత్యనారాయణ, కొంబత్తుల ఏసుబాబు, చంద్రశేఖర్, గుత్తుల మధు, కొక్కిరి రవికుమార్, అంద్రోతు కుమార్, ఉలిశెట్టి బాబి, పెచ్చెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విప్పర్తి వేణుగోపాలరావు

మసీదుల్లో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు

మామిడికుదురు: పవిత్రమైన రంజాన్‌ను పురస్కరించుకుని మండలంలోని వివిధ మసీదుల్లో శుక్రవారం జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. మామిడికుదురు షియా జామియా మసీదులో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న మత ప్రబోధకులు షబ్బర్ అలీజైదీ మాట్లాడుతూ రంజాన్ నెల ముస్లింలకు అతి పవిత్రమైనదన్నారు. రంజాన్ నెలలో శుక్రవారానికి ఎంతో ప్రాధాన్యం ఉంటుందన్నారు. మసీదు కమిటీ అధ్యక్షుడు సర్కిల్ పర్వత్ అలీబేగ్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. సున్నీ జామియా మసీదులో తారిక్ అన్వర్ రజా రజ్వీ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. మసీదు కమిటీ అధ్యక్షుడు మసూద్ మొహిద్దీన్ పర్యవేక్షించారు. మామిడికుదురు, నగరం, కొమరాడ, మొగలికుదురు, పెదపట్నం గ్రామాల ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు.